

చెకుముకి పరీక్ష వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నిర్మల్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పరీక్ష వాల్‌పోస్టర్‌ను అధ్యక్షుడు అంకం గంగాధర్ ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌టీయూ భవన్‌లో బుధవారం సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా విద్యార్థుల లో జిజ్ఞాస పరనాసక్తి పెంపొందించడానికి విద్యార్థులకు చెకుముకి పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి షేక్ రఫీక్, గౌరవ అధ్యక్షుడు ఆకుల సుదర్శన్, అనంత్ విశ్వేశ్వర్ పాల్గొన్నారు.



'హ్యామ్' ద్వారా రోడ్ల నిర్మాణం

- ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్

భైంసా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో హ్యామ్(హైబ్రిడ్ యాన్యూటీ మోడల్) పథకం ద్వారా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల పరిధిలో 190 కిలోమీటర్ల మేర రోడ్లనిర్మాణం చేపట్టనున్నట్లు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఇక్కడి విలేకరులకు ఫోన్‌ద్వారా మాట్లాడి వివరాలు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 25 ప్రాంతాలకు 137 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాలు జరుగనున్నాయన్నారు. రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో మూడు ప్రాంతాలకు 53 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రభుత్వం టెండర్ ప్రక్రియ నిర్వహించేందుకు చర్యలు చేపట్టిందని, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని వివరించారు.



జనసంద్రంగా బాసర

- తరలివచ్చిన భక్తజనం



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

బాసర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం బాసర గోదావరి నదీతీరం భక్తజన సంద్రంగా మారింది. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులు ప్రత్యేక వంటకాలు తయారుచేసి గోదారమ్మకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నది తీరాన కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థాన పండితులు నిర్వహించిన జ్వాలాతోరణం కార్యక్రమం అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో కొనసాగింది.



నదీతీరంలో జ్వాలా తోరణం





- సారంగాపూర్ మండలం మలక్ చించోలి గ్రామం నుంచి జౌళి గ్రామం వరకు వేసిన బీటీ రోడ్డు ఇదే

- లేదంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామంటూ హెచ్చరిక
- జిల్లాలో రూ.200 కోట్లకు పైగా బిల్లుల బకాయిలు
- చేసిన పనులకు అప్పుల పాలయ్యామంటూ ఆవేదన

కాంట్రాక్టర్ల.. అల్టిమేటం

పెండింగ్ బిల్లులు నెలాఖరులోగా చెల్లించాలి

నిర్మల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గత కొంతకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాలని, లేనట్లయితే పెద్దఎత్తున ఉద్యమిస్తామని కాంట్రాక్టర్‌లు సర్కారు కు అల్టిమేటం జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులే కాకుండా గత రెండేళ్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు పెద్దమొత్తంలో పేరుకుపోయాయని కాంట్రాక్టర్‌లు వాపోతున్నారు. ఈనెలాఖరులోగా ప్రభు త్వం తమ బిల్లులను చెల్లించనట్లయితే ఇక ఆన్ గోయింగ్ పనులన్నింటిని నిలిపివేసి ఉద్యమబాట పట్టేందుకు నిర్ణయించాయి. ఇందులో భాగంగానే జిల్లాల వారిరీగా కాంట్రాక్టర్‌ల అసోసియేషన్ జిల్లా కలెక్టర్‌లకు వినతి పత్రాలు సమర్పించాయి. ఈ నెలాఖరు వరకు వేచి చూసి డిసెంబరు మొదటి వారం నుంచి తమ ఆందోళనకు సంబంధించిన కార్యాచరణను అమలు చేయనున్నాయి. కాగా నిర్మల్ జిల్లాలో దాదాపు రూ. 200 కోట్లకు పైగా బిల్లులను సంబంధిత పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖల కాంట్రాక్టర్‌లకు చెల్లించాల్సి ఉంది. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో రూ.70 కోట్లు, ఆర్ అండ్ బి శాఖలో రూ.75 కోట్లతో పాటు ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్ సంబంధిత శాఖలకు సంబంధించిన మరో రూ. 50కోట్లకు మేర బిల్లులు బకాయిలు ఉన్నట్లు వారు పేర్కొంటున్నారు.

బకాయిల కోసం ఎదురుచూపులు

పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్ వివిధ మౌళిక సౌకర్యాల కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల పరిధిలో కాంట్రాక్టర్‌లు పెద్దఎత్తున కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను చేపట్టారు. అయితే ఈ చేసిన పనులకు గత ఐదారు సంవత్సరాల నుంచి ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోతుండడంతో కాంట్రాక్టర్‌లు చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలంటూ హెచ్చరికలు జారీ చేయడంతో వారంతా నిర్ణీత గడువులోనే పనులను కొనసాగిస్తున్నారు. అయితే నిధుల కొరత కారణంగా అన్ని శాఖల్లోనూ సంబంధిత కాంట్రాక్టర్‌లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తోంది. ప్రభుత్వం సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చేసిన హెచ్చరికలతో కాంట్రాక్టర్‌లు మరీ అప్పులు చేసి పనులను చేస్తున్నారు. అయితే దీని కోసం గానూ పెద్ద మొత్తంలో చేసిన పెట్టుబడులకు సంబంధించి వడ్డీలను కూడా వారు తీర్చలేకపోతున్నారు. బ్యాంకులు అలాగే ప్రైవేటు వ్యాపారుల నుంచి వీరు పెద్దమొత్తంలో రుణాలు తీసుకొని మేషనరీ ఇతర సౌకర్యాలకు సంబంధించి సామాగ్రిని కొనుగోలు చేశారు.

హామ్ రోడ్లపై అభ్యంతరాలు

కాగా ప్రభుత్వం ఇటీవల హామ్ రోడ్ల ప్రతిపాదనలను తెరపైకి తేవడమే కాకుండా దీనికి సంబంధించిన ప్రతిపాదనలను సైతం రూపొందించి అవసరమైన నిధులను కేటాయించేందుకు సిద్ధమైంది. ఈ హామ్ విధానంలో కాంట్రాక్టర్‌లకు ముందుస్తుగానే మొత్తం పనిలో పది శాతం నిధులను అడ్వాన్స్‌గా చెల్లించనున్నారు. దీనిపై కాంట్రాక్టర్‌లు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.కోట్లాది బిల్లులను చెల్లించకుండా హామ్ రోడ్ల విధానం పేరిట గుత్తేదారులకు ముందస్తుగానే అంచనా వ్యయంలో పది శాతం చెల్లించడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. తాము చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతుంటే.. పదిశాతం నిధులు సమంజసం కాదంటున్నారు.

ఈ నెలాఖరు వరకు వేచి చూస్తాం

: రామారావు, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

తమ పెండింగ్ బిల్లులకు సంబంధించి చెల్లింపుల విషయమై ఈ నెలాఖరు వరకు వేచి చూస్తాం. ఇప్పటికే తమకు కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేసేందుకు తామంతా అప్పులు చేసి పనులు పూర్తి చేశాం. అయినప్పటికి ప్రభుత్వం తమ బిల్లులను చెల్లించకపోవడం సమంజసం కాదు. ఇక అప్పుల బాదను తాళలేక తాము తాడోపేడోకు సిద్ధమవుతున్నాం. ఈ నెలాఖరు వరకు బిల్లులను చెల్లించనట్లయితే ఉమ్మడి జిల్లాస్థాయిలో పనులన్నింటిని నిలిపివేసి ఆందోళనలు చేపడతాం.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి : ఎన్.రామారావు, బిల్డర్స్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్

వివిధ శాఖలకు సంబంధించి అభివృద్ధి పనుల టెండర్లు దక్కించుకొని పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు గత రెండు మూడేళ్లగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో చాలా మంది కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అప్పులు చేసి పనులు పూర్తి చేసిన కొంతమంది కాంట్రాక్టర్లు వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితిలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై చాలాసార్లు సీఎంతో పాటు మంత్రులతో మొరపెట్టుకున్నా.. ప్రయోజనం లేకుండా పోయింది. తమకు న్యాయంగా ఇవ్వాల్సిన బిల్లులు ఇవ్వకుండా కొత్తగా హామ్ రోడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ ఫండ్ కింద 10 శాతం అడ్వాన్స్ చెల్లించడం సరైన పద్ధతి కాదు. ఒకవైపు నిధులు లేవంటూనే మరోవైపు హామ్ రోడ్లకు అడ్వాన్స్‌లు ఇవ్వడానికి నిధులు ఎక్కడి నుంచి వస్తాయి. ఈ నెల 30 వరకు వేచి చూస్తాం. తమ సంఘం ఆధ్వర్యంలో తగు నిర్ణయం తీసుకుటాం.

జాతరకు పోటెత్తిన భక్తులు

- అలరించిన కుస్తీ పోటీలు



కుస్తీపోటీల్లో తలబడుతున్న మల్లయోధులు

తానూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తానూర్ విఠలేశ్వర ఆలయంలో కార్తీకపౌర్ణమి ఉత్సవాలు బుధవారం వైభవోపేతంగా ముగిశాయి. మంగళవారం రాత్రి నిర్వహించిన రథోత్సవం శోభాయాత్ర గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కనుల పండువగా సాగింది. రథయాత్ర ప్రారంభం శోభాయాత్ర ప్రారంభానికి ముందు, విఠలరుక్మాయి ఆలయంలో వేదపండితులతో ప్రత్యేక పూజలు చేసి, రథానికి హారతి ఇచ్చి రథోత్సవం శోభాయాత్ర ప్రారంభించారు. ఈ రథోత్సవ శోభాయాత్ర 107 సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఈ శోభాయాత్ర ప్రధానవీధుల గుండా కొనసాగింది. మహిళలు మంగళహారతులతో ఎదురెళ్లి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం శోభాయాత్రను తిలకించడానికి పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఈ శోభాయాత్ర కనుల పండువగా వైభవోపేతంగా సాగింది. దీంతో గ్రామంలో ఎటు చూసినా పండుగ వాతావరణం నెలకొంది. జాతర సందర్భంగా వ్యాపారస్థులు దుకాణాలు ఏర్పాటు చేశారు. యువతులు గాజులను, చిన్న పిల్లలకు అడుకునే ఆటవస్తువులను, తినుబండారాలను కొనుగోలు చేశారు.



జాతరలో వెలిసిన దుకాణాలు

వైభవంగా కార్తీకపౌర్ణమి

- దీపాలు వెలిగించిన మహిళలు
- పలుచోట్ల జ్వాలాతోరణం
- గోదావరి పుణ్య స్నానాలు



కదిలిలో తులసి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

నిర్మల్‌రూరల్/దిలావర్‌పూర్/సోన్/ముథోల్/లోకేశ్వరం/కుంటాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి వేడుకలను బుధవారం ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే ఇంటి ఎదుట తులసి చెట్టుకు పందిరి వేసి దీపాలు వెలిగించి హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కొండాపూర్‌లో గల శివాలయంలో దీపోత్సవం, రుద్రచండీ యాగం నిర్వహించినట్లు వేదపండితులు సంజయ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దిలావర్‌పూర్ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని పురాతన పుణ్యక్షేత్రం శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయంలో తులసి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం వివిధ రకాల కార్తీక దీపకాంతులతో నిండిపోయింది. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా వచ్చారు. దీపదానాలు చేశారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. శ్రీ పాపహరేశ్వర స్వామిని, శ్రీ మాతాన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామివారికి అభిషేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. భారీగా వచ్చిన భక్తులతో కదిలి లోయ సందడిగా మారింది.



గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు చేస్తున్న దృశ్యం

సోన్ : కార్తీక మాసం పురస్కరించుకుని బుధవారం సోన్ మండల కేంద్రంలోని గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆధ్యాత్మిక భావంతో తీరం ఒడ్డున సైకత లింగాలను తయారు చేసి, దీపాలు వెలిగించి, గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో మాదాపూర్, సోన్ పుష్కర ఘాట్‌లు కిటకిటలాడాయి.

ఘనంగా జ్వాలాతోరణం

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిమాత - దామోదరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి, 365 వొత్తులు వెలిగించారు. ఇంటి ఎదుట దీపాలు వెలిగించారు. దీంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శివాలయం వద్ద జ్వాలాతోరణం కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి పండితుడు బసవరాజు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీన్ని పురస్కరించుకొని మహిళలు తులసీ చెట్ల వద్ద దీపాలు వెలిగించి, మొక్కులు మొక్కుతూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో మంగళవారం కార్తీకపౌర్ణమి వేడుకలు నిర్వహించగా, మరికొన్ని గ్రామాల్లో బుధవారం కార్తీకపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.



ఎడ్‌బిడ్‌లో జ్వాలా తోరణం దీపోత్సవం

లోకేశ్వరం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో కార్తీకపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు మహిళా భక్తులు చేరుకొని కార్తీకదీపాలు వెలిగించి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. లోకేశ్వరం శివాలయంలో అర్చకులు అమ్ములు ఆధ్వర్యంలో తులసి వివాహం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అనేక భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కార్తీకపౌర్ణమి విశిష్టతను తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.



ఎడ్‌బిడ్‌లో దీపోత్సవం

కుంటాల : కుంటాల మండలంలో బుధవారం కార్తీక పౌర్ణమి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తులసి, ఉసిరి మొక్కలకు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. అంతేగాకుండా ఇంటి ముఖద్వారాల వద్ద దీపాలు వెలిగించారు. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంది.



దేదీప్యమానంగా కార్తిక పౌర్ణమి



ఆదిలాబాద్‌లో దీపం వెలిగిస్తున్న మహిళ



దీపాల వెలుతురులో వెలిగిపోతున్న ఆలయం



స్వామివారికి హారతులు అందిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి వేడుకలు జిల్లాలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రసిద్ధ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. పట్టణంలోని పురాతన శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మటంలో కార్తికపౌర్ణమి శోభ కనిపించింది. వందలాది సంఖ్యలో మహిళలు, యువతులు కాగడ హారతులు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దీపాలను అందంగా అలంకరించడం విశేషంగా ఆకట్టుకుంది. మఠం ప్రాంగణంలో చేపట్టిన దీపారాధన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెల్లవారుజామున ఆలయానికి వచ్చిన భక్తులు ప్రత్యేక దీపాలంకరణలో పాల్గొన్నారు. మటాదిపతి శ్రీ యోగానంద సరస్వతి నేతృత్వంలో ఆలయంలో కాగడ హారతులు అందించి భక్తి గీతాలను ఆలపించారు.

ఇచ్చోడ : చరిత్ర కలిగిన అతి పురాతన చెరువు.. చెరువు మధ్యలో మల్లన్న.. ఆ మల్లన్నను దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు సిరిచెల్మ మల్లికార్జున స్వామి ఆలయానికి. కార్తిక పౌర్ణమి రదర్భంగా సిరిచెల్మ మల్లన్న ఆలయంతో పాటు మండలంలోని అన్ని శివాలయాలతో పాటు అన్ని

దీపాలతో వెలిగిన ఆలయ ప్రాంగణాలు

ఆలయాల్లో కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగాయి.

ఉట్నూర్ : మండలంలోని ఆలయాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని హనుమాన్‌ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించి ఉత్సవాలు నిర్వహించుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలందరు మంగళ హారతులతో ఆలయానికి చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి బాలాజి దుబే ఆధ్వర్యంలో కార్తీక పురాణం వినిపించారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో తులసి వివాహం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొమ్ముగూడ హనుమాన్ మందిరంలో పూజారి దీపక్ దుబే ఆధ్వర్యంలోకార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. గణేష్ మహారాజ్ ఆధ్వర్యంలో భక్తీ ప్రవచనాలు జరిగాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. సాలెవాడ కెలోని శివాలయంలో మహిళలు కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

బోథ్ : కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా భక్తీ శ్రద్ధలతో జరుపుకునారు. 15 రోజుల నుంచి ఉదయం నాలుగు గంటలకే మహిళలుచన్నీటి స్నానాలుచేసి ప్రత్యేక పూజ కార్యక్రమం చేపట్టారు. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇండ్లలోని తులసి మొక్కలకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి పూజలు చేయడం జరిగింది.

గుడిహత్నూర్ : మండలంలో కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఇండ్లలో మహిళలు కుటుంబ సమేతంగా తులసి చెట్టుకి పూజలు చేసి కల్యాణం నిర్వహించారు. పురాతన శివాలయం, విఠలరుక్మిణి మందిరంలో నెల నుంచి కాగడా హారతి, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం ఘనంగా కార్తీకపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా తలమడుగు మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో నెల రోజుల పాటు కార్తీక్ స్థానాలు ఆచరించి పౌర్ణమి రోజున స్వామివారి ఉత్సవ విగ్రహాలతో భాజ భజంత్రీలతో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆలయంలో గోమాత పూజలు నిర్వహించి తులసి చెట్టుకు ఉసిరి చెట్టుకు గో వివాహం జరిపించారు. ఇందులో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కేద్రేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గణేష్ రెడ్డి, గ్రామస్తులు గోవర్ధన్ రెడ్డి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి, పద్మకర్ రెడ్డి, ఇంద్ర సేన రెడ్డి, తిరుపతి రెడ్డి, మహిళ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని శివాలయం పాటు పట్టణంలోని అన్ని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, శివలింగానికి అభిషేకాలు జరిపి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బజార్ హత్నూర్ : సాంప్రదాయం ప్రకారం భక్తులు తమ ఇళ్లలో తులసి గద్దె వద్ద, ఆలయాల్లో దీపాలు వెలిగించి ఆరాధించారు. ఈ సందర్భంగా భక్తి భక్తిశ్రద్ధలతో తులసి కల్యాణం జరిపారు. బాణా సంచ కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ పండగతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.



గుడిహత్నూర్‌లో దిండి నిర్వహిస్తున్న భక్తులు



నగర సంకీర్తన నిర్వహిస్తున్న గ్రామస్తులు, భక్తులు



బజార్‌హత్నూర్‌లో తులసి కళ్యాణంలో భక్తులు

పత్తి రైతుకు.. మద్దతు కరువు

(5వ పేజీ తరువాయి...)

నవంబరు, డిసెంబరులలో సాధారణంగా తేమ ఎక్కువగానే ఉంటుంది. ఈ కారణంగా తేమ 15 నుంచి 30 వరకు వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు సీసీఐ 412 మంది రైతుల నుంచి 7,961 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేసింది. ఇందులో కేవలం 52 మంది రైతులకే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ.8,110 దక్కింది. మిగితా రైతులకు ధరల్లో కోతలు విధించారు. 8 తేమ శాతం తర్వాత ఒక్కో పాయింట్‌కు రూ.81.10 తగ్గిస్తున్నారు. అలాగే ప్రైవేట్ వ్యాపారులు 839మంది రైతుల నుంచి 14,937 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. దీన్ని భట్టి చూస్తుంటే ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ వ్యాపారుల కే పత్తిని అమ్ముకుంటున్నట్లు తెలుస్తుంది. దీనికి తోడు సీసీఐ కొనుగోళ్లపై పరిమితులు విధించడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. గతేడు ఎకరాన 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా ఈ యేడు ఏకంగా 5క్వింటాళ్లను తగ్గించి 7 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేస్తుంది. దీంతో రైతులు ఆందోళనలు, నిరసనలకు దిగుతున్నారు.

ఎంపీ ఇంటి ముందు ఆందోళన

పత్తి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్ ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఎంపీ ఇంటిని ముట్టడించడం ఉద్రిక్తంగా మారింది. అడ్డుకున్న పోలీసులతో బీఆర్ఎస్ నేతలు తీవ్ర వాగ్వాదానికి దిగారు. మాజీ మంత్రి జోగు రామన్నను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట వాగ్వాదం జరిగింది. పోలీసుల వైఖరికి నిరసనగా రూరల్ పోలీసు స్టేషన్ ముందు బీఆర్ఎస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కార్పొరేట్ సంస్థలకు అమ్ముడు పోయారంటూ మాజీ మంత్రి జోగు రామన్న తీవ్ర ఆరోపణలు చేశారు.

యథావిధిగా పత్తి కొనుగోలు : కలెక్టర్

రాష్ట్ర మంత్రి, ఏపీసీ, సెక్రెటరీ, సీసీఐ సీఎండీ, జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో నవంబర్ 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే నిరవధిక సమ్మెను వాయిద వేయడం జరిగిందని కలెక్టర్ రాజర్షి షా బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లులలో పత్తి(ప్రోక్యూర్‌మెంట్) కొనుగోలు కార్య క్రమాలు యథావిధిగా కొనసాగుతాయని ఆయన తెలిపారు. జిల్లా మార్కెటింగ్ అధికారులు ఈ సమాచారాన్ని రైతులకు విస్తృతంగా చేరేలా ప్రచారం చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు.

జిల్లాలో పత్తి కొనుగోళ్ల వివరాలు ఇలా..

	రైతులు	కొనుగోలు పత్తి (క్వింటాళ్లలో)	
సీసీఐ	412	7961	
ప్రైవేట్	839	14937	
మొత్తం	1,251	22899	
తేమ శాతం	**రైతులు**	**కొనుగోలు పత్తి**	**ధర**
8 శాతం	52	1094	రూ.8,110
9 శాతం	43	924	రూ.8,029
10 శాతం	80	1585	రూ.7,948
11 శాతం	85	1482	రూ.7,867
12 శాతం	152	2874	రూ.7,786

రెజ్లింగ్‌లో తానూర్ విద్యార్థికి బంగారు పతకం



బంగారు పతకం సాధించిన విద్యార్థి

తానూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం ముధోల్‌లోని జెడ్పీఎస్ఎస్ తానూర్ పాఠశాల విద్యార్థి సీహెచ్ బాలాజీ జోనల్ స్థాయి రెజ్లింగ్‌పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఉమ్మడి జిల్లా కేంద్రం ఆదిలాబాద్‌లో నిర్వహించిన జోనల్‌స్థాయి రెజ్లింగ్ పోటీలలో భాగంగా అండర్ - 17 వయో విభాగంలో, 45కేజీల పోటీల్లో విద్యార్థి ప్రతిభ కనబరిచి బంగారు పథకం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందిస్తున్నారు.

అడెల్లి ఆలయ డైరెక్టర్‌కు సన్మానం



మామిడి నారాయణ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

లోకేశ్వరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సారంగాపూర్ మండలం అడెల్లి ఆలయ డైరెక్టర్‌గా ఎన్నికైన ధర్మోరా గ్రామానికి చెందిన మామిడి నారాయణ రెడ్డి, లోకేశ్వరం మాజీ మండల ప్రెసిడెంట్‌ను ధర్మోగా గ్రామానికి చెందిన యువకులు, నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మామిడి నారాయణ రెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి

● నారాయణ మహరాజ్

తలమడుగు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని నారాయణ మహరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శాస్త్రీనగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయకమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నారాయణ మహరాజ్‌కు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయంలో అందునాయక్ తండా మహరాజ్ రాంసింగ్ మహరాజ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉద్దేశించి ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పటేల్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, పడ్ విశ్వనాథ్, ఆలయ కమిటీ సభ్యులు బాలాజీ సాకర్, చామత్వీర్ సంజీవ్, కేంద్రే సూర్యకాంత్, గాయక్ వాడ్ రాజు, సూర్యవంశీ సంతోష్, చాటే శంభా, రాము, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి



సావర్గంలో టీకాలు వేస్తున్న డాక్టర్ రాథోడ్ జీవన

నేరడిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల రైతులందరూ తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బుద్దికొండ, సావర్గం గ్రామాలలో టీకాలు వేశారు. ఈ సందర్భంగా రాథోడ్ జీవన్ మాట్లాడుతూ చలికాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తుగా పశువులన్నిటికీ తప్పకుండా గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 70 శాతం పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ఇందులో పశు వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పనిముట్ల పంపిణీ



లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రాంనాథ్

నిర్మల్ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన విశ్వకర్మ యోజన పనిముట్లను పట్టణంలోని మంజులాపూర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాత్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రావుల రాంనాథ్ మాట్లాడుతూ... దేశ ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో చేతివృత్తుల మీద ఆధారపడి జీవించే ప్రజల కోసం నూతనంగా విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రారంభించి కోట్ల రూపాయలు ఖర్చు చేసి వారికి శిక్షణ ఇస్తూ శిక్షణ కాలంలో అదనంగా రోజువారీ ఖర్చులకు డబ్బులు ఇస్తూ శిక్షణ పొందిన తర్వాత వారికి ఉచితంగా ఆయా వర్గాల వారికి పనిముట్లు అందజేస్తున్నారన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ చేతి వృత్తుల కళాకారులకు తీవ్రనష్టం చేకూర్చడమే కాకుండా వారి నైపుణ్యాన్ని పక్కనపెట్టి వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. వారి నైపుణ్యతను గుర్తించి వారికి ఆర్థికంగా, నైపుణ్యం కలిగిన వారితో శిక్షణను ఇచ్చి వారిని మరింత ప్రోత్సాహాన్ని అందించి, కింది అట్టడుగు వర్గాలను ఆదుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. నిర్మల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కృషి ఫలితంగా ఈ పథకం అన్ని గ్రామాల్లో అన్ని చేతివృత్తుల వారికి పనిముట్లు అందిస్తున్నామని చెప్పారు. రానున్న కాలంలో ఈ పథకాన్ని మరింత కింది స్థాయికి తీసుకెళ్లి అర్హులైన పేదలందరికీ ఈ పథకం వర్తింపజేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం ప్రధానకార్యదర్శి అయిండ్ల రమేష్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి లింగం, కరుణా సాగర్, కడారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు నిరంతర పోరాటం

ఖానాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అమరుల ఆశయ సాధన కోసం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నిరంతర పోరాటం కొనసాగిద్దామని ఆ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు నందిరామయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.అంకుష్ రావు అధ్యక్షతన ఖానాపూర్‌లో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరిట అడవిలో ఉన్న సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర సాగుతోందన్నారు. పోడు భూములను సాగు చేసుకున్న రైతులకు నేటికీ పట్టాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టకుండా పల్లెల్లో పాలనను కుంటు పట్టిస్తున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం పని చేయాలని ఈ సందర్భంగా రామయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జక్కుల రాజన్న, సుదర్శన్, లక్ష్మణ్, వర్మ, రాజన్న, భీమ్‌రావు, సోనేరావు, తదితరులున్నారు.



సభలో మాట్లాడుతున్న నంది రామయ్య

జిన్నింగ్ మిల్లుల యజమానుల సమ్మె బాట

- సమస్యల పరిష్కారానికి మిల్లుల మూసివేత
- నిలిచిపోనున్న పత్తి కొనుగోళ్లు
- రైతులకు తప్పని తిప్పలు



భైంసాలోని జిన్నింగ్ ఫ్యాక్టరీ

భైంసా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ కొనుగోళ్లకు సంబంధించి విధించిన నిబంధనలను తొలగించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిన్నింగ్ మిల్లుల యజమానులు గురువారం నుంచి సమ్మె బాట పట్టనున్నారు. మిల్లులను మూసివేసి పత్తి కొనుగోళ్లను నిలిపివేయనున్నారు. రెండు రోజుల క్రితమే ప్రారంభమైన సీసీఐ కొనుగోళ్లపై మిల్లుల యజమానుల సమ్మె ప్రభావం పడనుంది. ప్రతికూల పరిస్థితులతో అష్ట, కష్టాలు పడుతున్న రైతాంగం జిన్నింగ్ మిల్లుల యజమానుల సమ్మెతో మరింత ఇబ్బందులను ఎదుర్కోనుంది.

ప్రధాన డిమాండ్‌గా

ఎల్ 1, 2, 3 నిబంధన తొలగింపు

సీసీఐ కొనుగోళ్లకు సంబంధించి జిన్నింగ్ ఫ్యాక్టరీల ఎంపిక, నిర్వహణ ప్రక్రియలో విధించిన ఎల్ 1, 2, 3 నిబంధనను తొలగించాలనే ప్రధాన డిమాండ్‌తో జిన్నింగ్ మిల్లుల యజమానుల సంఘం సమ్మెబాట పట్టింది. ఎల్ 1, 2, 3 నిబంధనతో కొన్ని జిన్నింగ్ మిల్లులకు ప్రయోజనం చేకూరగా మిగతా జిన్నింగ్ మిల్లులకు కొనుగోలు కేంద్రాల ఎంపిక ప్రక్రియలో అన్యాయం జరుగనుందని పలు మిల్లుల యజమానులు ఆరోపిస్తున్నారు. ఇదే క్రమంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణలో విధించిన ఇతర నిబంధనల్లో సైతం మార్పులు చేపట్టాలని మిల్లుల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతాంగం పత్తిని విక్రయించేందుకు గాను అమలులోకి తీసుకవచ్చిన కిసాన్‌కపాస్ యాప్‌ను సైతం ఎత్తివేయాలని మిల్లుల యజమాన్యం పేర్కొంటోంది. దీనికి తోడు ఎకరానికి 7 క్వింటాళ్ల పరిమితిని ఎత్తివేసి ఇది వరకటి లాగే 12 క్వింటాళ్ల మేర పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అగచాట్ల పాలవుతున్న పత్తి రైతు

ప్రతికూల పరిస్థితులతో పడరాని పాట్లు పడుతున్న పత్తి రైతులు జిన్నింగ్ మిల్లుల యజమానుల సమ్మెతో అగచాట్ల బారిన పడనున్నారు. పత్తి దిగుబడులను విక్రయించుకొని వచ్చిన డబ్బులతో యాసంగి పంటల సాగుకు సిద్ధమవుదామనుకున్న రైతాంగం పెట్టుకున్న ఆశలకు గండిపడే పరిస్థితులు నెలకొన్నాయి. సమ్మెతో పత్తి కొనుగోళ్లు నిలిచిపోతున్న నేపథ్యంలో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

అయ్యప్పస్వామి దీక్ష మాలధారణ



భైంసాలో మాలాధారణ స్వీకరిస్తున్న యువకులు

భైంసా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అయ్యప్ప స్వామి దీక్షను స్వీకరించారు. వేకువజాము వేళలో ఆలయంలో రోజువారి పూజ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత అలయ ప్రధాన అర్చకులు సాయినాథ్ దీక్షదారులకు మాలాదారణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్తీకపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అధికశాతం మంది అయ్యప్ప స్వామి దీక్షలు స్వీకరించా రు. భక్తుల శరణు ఘోషతో అయ్యప్ప క్షేత్రం మార్మోగిపోయింది.

గౌడ సంఘం సర్వసభ్య సమావేశం



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న దృశ్యం

ముథోల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్మల్ జిల్లా గౌడ సంఘం ఎన్నికల్లో చేపూరి కనకాగౌడ్ జిల్లా అధ్యక్షుడిగా, ముష్కం అశోక్ గౌడ్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, గర్గుల మురళి గౌడ్ రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు మండల గౌడసంఘం తరపున వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం బాధ్యులు శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అంజిగౌడ్, సత్తయ్య గౌడ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహనీయుల బాటలో నడవాలి

ఉట్నూర్, నవంబర్5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పూలాజినగర్‌లో పూలాజిబాబా ధ్యాన మందిరం 25వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. బుధవారం గురుపౌర్ణమి వేడుకలు పురస్కరించుకుని పాట్నాపూర్ పూలాజిబాబా సంస్థాన్ అధ్యక్షులు ఇంగ్లేకేశవ్ మాట్లాడుతూ మహనీయులు స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుంటు ప్రతి ఒక్కరు దైవ మార్గంలో నడవాలన్నారు. నేటి తరం వారిని భక్తి మార్గంలో నడిపించే బాధ్యత తల్లి దండ్రుల పై ఆధారపడి ఉందన్నారు. చిన్నారుల్లో క్రమశిక్షణ పెరగాలంటే ప్రతి ఒక్కరు దైవ మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లేవామన్, బ్రీజ్‌లాల్, తుకారం, పూల్‌చంద్, గంగారాం, ఆనంద్‌రావు, గోవింద్, విఠల్, భూమేష్, తులిసారం పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ.. కనిపించదేమీ?



» నిత్యం ప్రమాదాలతో భయపడుతున్న ప్రయాణికులు -ప్రాణాలు కాపాడటంలో కీలక పాత్ర
» ఎక్కడ కనిపించని కాల్ బాక్సులు - కాల్‌బాక్సులు ఉన్నట్టు బొర్డులు మాత్రమే మిగిలాయి

ఇచ్చోడ,నవంబరు 5(ఆంధ్రజ్యోతి):నాలుగు వరుసల జాతీయ రహదారి అసౌకర్యాలకు చిరునామాగా మారింది.ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారుల పక్కన ఉన్న ఎస్‌ఒఎస్ ఫోన్ బాక్సులను అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులకు ఉపయోగంలోకి వచ్చేందుకు ఏర్పాటు చేసిన కాల్‌బాక్స్‌లు ఎక్కడ కనిపించడం లేదు. కాల్ బాక్సుల నిర్వహణ లేకపోవడంతో రహదారి పక్కన అక్కడక్కడ ఏర్పాటుచేసిన బాక్సుల్లో కాల్‌బాక్స్ లేక పోవడం, ఏకంగా కాల్ బాక్స్ స్టాండ్స్ లేక పోవడం.. ఫోన్‌కాల్ బాక్సులకు ఏర్పాటుచేసిన సెఫ్టీ బాక్సులు అనవాళ్లు కూడా ఎక్కడ కనబడడంలేదు. నేషనల్ హైవేపై అసౌకర్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కథనం..

జాతీయ రహదారిపై ఉండేకాల్ బాక్స్‌ల పనితీరు ఇలా

జాతీయ రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ ఆ హైవేపై కొన్ని విషయాలను గమనించాల్సిన అవసరం ఎంతైన ఉంది. జాతీయ రహదారి సంస్థ అధికారులు ఏర్పాటు చేసిన ఏర్పాట్లు మన ప్రాణాలను కాపాడుతాయి. విశాలమైన రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగతుంటాయి. రహదారులు చాలా వెడల్పుగా ఉండడం ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, వాహనాల రద్దీ పెద్దగా ఉండకపోవడం కారణంగా వాహనాలు చాలా స్పీడ్‌గా వెళ్తుంటాయి. అలాంటి సమయంలో రోడ్డు ప్రమాదాల బారిన పడినపుడు తక్షణమే సహాయం అందుకోవడానికి రోడ్డు పక్కన కొన్ని కాల్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తారు. ఆ బాక్సులను ఎస్‌ఒఎస్ బాక్స్‌లు అంటారు. ప్రతి 300 మీటర్లకు ఒక కాల్ బాక్స్ ఉంటుంది. ప్రమాదంలో మన ఫోన్ కూడా ధ్వంసం అయినట్లయితే రోడ్డుపక్కన ఉండే ఈ బాక్సు వద్దకు వెళ్లి అక్కడ కనిపించే బటన్‌ను లాంగ్ ప్రెస్ చేసి యాక్సిడెంట్ జరిగిందని వాయిస్ చెబితే చాలు. వెంటనే ఆ పరిధిలో ఉన్న అంబులెన్స్, పోలీస్ స్టేషన్, టోల్ ప్లాజా, ఫైర్ స్టేషన్‌లకు మీ సందేశం చేరడంతో మీ ప్రాణాలు కాపాడేందుకు ఏమర్జెన్సీ సర్వీసెస్ అందుబాటులోకి వచ్చి మిమ్మల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి సేవలను అందించడమే ఈ బాక్సుల పనితీరు.

జాతీయ రహదారిపై కరువైన సౌకర్యాలు



ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల మీదుగా మూడు టోల్ ప్లాజాలతో ఏర్పాటుచేసిన 44వ జాతీయ రహదారి అంత అసౌకర్యంగా మారింది. ముఖ్యంగా ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంలేదు. ఫోన్‌కాల్ బాక్సులు రహదారి పక్కన ఎక్కడ కనిపించడం లేదు. ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్ వెళ్లాలంటేనే భయంగా ఉంది.గతేడాది వర్షాలకు దెబ్బతిన్న రోడ్డుకు ఇప్పటి వరకు మరమ్మతులకు నోచుకొని పరిస్థితి. హైవే నిర్వహకులు ఫోన్‌కాల్ బాక్స్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఎమర్జీన్సీ సర్వీసెస్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

- కల్లెం ప్రవీణ్‌రెడ్డి, ప్రయాణికుడు, ఇచ్చోడ



ఇచ్చోడలోని రాణి జిన్నింగ్ వద్ద కనిపించని ఫోన్‌బాక్స్





పెంటకుప్పలకు పరిమితమైన ఫోన్‌బాక్సు స్టాండ్

వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

బోథ్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని బోథ్ ఆసుపత్రి వైద్యులు సూపరింటెండెంట్ రవి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో ఏర్పాటైన కార్యక్రమంలో గ్రామస్థులకు వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే అనేక రోగాలు దరిచేరవన్నారు. అంతేకాక ఇంటి చుట్టు మురికి నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని నీరు నిలిచి ఉంటే దోమలు పెరిగి మలేరియా టైఫాయిడ్ డయేరియా క్షయా వంటి వ్యాధులు ప్రబలుతాయి అన్నారు. అంతేకాక యువత మద్యానికి గంజాయి సేవనానికి దూరంగా ఉండాలని దురలవాట్ల వల్ల ఆరోగ్యం చెడిపోయి చిన్న వయసులోనే మృత్యువాత పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్త పరిచారు. వ్యాధులు సోకిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలని లేకుంటే మూఢనమ్మకాల బారీన పడి ప్రాణాల మీద తెచ్చుకుంటున్నారన్నారు.నాటువైద్యం తాయెత్తులు మంత్రాలు చేస్తారంటూ నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, గ్రామస్తులు పూజారెడ్డి, అల్లంరవి, గంగాధర్, సాయికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నగేష్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు రాకేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

కుక్కదాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన బాలుడు

భైంసారూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని హజ్గుల్ గ్రామంలో ఓ కుక్క దాడిలో రుద్రాన్స్ అనే బాలుడు గాయపడ్డారు. బాలుడు తమ ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ఓకుక్క ఒక్కసారిగా రుద్రాన్స్‌పై దాడి చేయడా అరుపులు వేశాడు. ఇది గమనించిన స్థానికులు కుక్కను తరిమి వేడయంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. బాలుడిని కుటుంబీకులు భైంసా ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్సలు చేయించారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని అధికారులకు సూచించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు తెలిపారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



సాయన్న (ఫైల్)

భైంసారూరల్,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందిన ఘటన మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది.గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వానల్‌పాడ్ గ్రామానికి చెందిన తోకల సాయన్న(50) ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిగా విధులు నిర్వహించేవాడు.గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో ఆసుపత్రిలో చూయించుకున్న ఎంతకీ నయం కాకపోవడంతో సమస్యలు తీవ్రమై మృతి చెం దాడు. విషయం తెలుసుకున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఏపీవో లక్ష్మారెడ్డి, హెచ్‌ఆర్ సుధాకర్, ఫైనాన్స్ మేనేజర్ సందీప్, టీఏ బక్కన్న హాజరై నివాళులర్పించి, మృతుడి కుటుంబానికి రూ.20,000ల ఆర్థిక సహాయాన్ని అందించారు. మృతుడికి ఓ కుమారుడు, కూతురు ఉన్నారు.

వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



కుభీర్ బస్టాండ్‌లో..

కుబీర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఆగి ఉన్న బులెరో వాహనాన్ని భైంసా డిపోకు చెందిన బస్సు ఢీ కొంది. భైంసా నుంచి కుబీర్ మండల కేంద్రానికి వచ్చిన బస్సులో నుంచి ప్రయాణికులు దిగిపోయారు. అనంతరం బస్సును స్టాఫ్ పాయింట్‌కు పెట్టే క్రమంలో డ్రైవర్ అజాగ్రతతో ఆగి ఉన్న బులెరో వాహనాన్ని ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. బస్సులో ప్రయాణికులు లేక పోవడంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో పదుల సంఖ్యలో బస్టాండ్‌లో ప్రైవేటు వాహనాలు నిలపుతున్నారని బస్టాండ్‌లోకి ప్రైవేట్ వాహనాలు రావడానికి అనుమతి ఎవరు ఇచ్చారని ప్రయాణికులు అంటున్నారు మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా ఆర్టీసీ అధికారులు ప్రైవేట్ వాహనదాలరులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఢీకొన్న ఆర్టీసీ అద్దె బస్సుసైడ్ కిటికీలు అద్దాలు పగిలినట్లు తెలిపారు.

ఘనంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు



స్వామివారి పల్లకిని ఊరేగిస్తున్న దృశ్యం

ఖానాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మావతినగర్ కాలనీలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ 41వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఉదయం హవాన, బలిహరణాదులు, సాయంత్రం రథయాగం, రథబలి, ఆకాశదీపం కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు ఆలయ ప్రాంగణంలో జాతర అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. రథోత్సవంలో భాగంగా రాత్రి పట్టణ పురవీదులలో స్వామివారి రథాన్ని ఊరేగించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది. వేద పండితులు చక్రపాణి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేష్, కోశాధికారి ఉషకోల సుధాకర్, సభ్యులు తుమ్మనపెల్లి లక్ష్మణ్, లింగాల రాము, రాం చిన్న భీమన్న, వెన్నం అంజయ్య, లింగాల లక్ష్మణ్, నడిమెట్ల రమేష్, సత్యనారాయణ,రాజు, సుబ్రహ్మణ్యం,సాంబారు ఎల్లప్ప, నడిమెట్ల సురేష్, రాజేష్, తదితరులున్నారు.

రైతులను నట్టేట ముంచుతున్న కేంద్ర ప్రభుత్వం

» మాజీ మంత్రి,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న
» తేమ నిబంధనలు, కొనుగోళ్లపై పరిమితిని విధించడంపై తీవ్ర ఆందోళన
» ఉద్రిక్తంగా మారిన బీఆర్ఎస్ శ్రేణుల ఎంపీ ఇంటి ముట్టడి
» మాజీమంత్రి జోగురామన్న అరెస్ట్... నిరసనలో ఉద్రిక్తత



బీఆర్ఎస్ నేతలను వాహనంలో తరలిస్తున్న దృశ్యం



ఎంపీ ఇంటి వద్దకు వెళ్తున్న నేతలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్),నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తేమ నిబంధనలు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని ఎన్నో సార్లు వినతులు ఇచ్చినా పట్టించుకునే నాథుడు లేదని, తాజాగా ఎకరానికి ఏడు క్వింటాళ్లు మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందన్న నిబంధనను తెచ్చి రైతులను కేంద్రం నట్టేట ముంచుతోందని మాజీ మంత్రి,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న మండిపడ్డారు.రైతుల పట్లకేంద్రం అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన ఎంపీ నగేష్ ఇంటి ముట్టడి ఉద్రిక్తంగా మారింది.ఎంపీఇంటిముందు మాజీమంత్రి జోగురామన్నతో పాటు నేతలు భైఠాయించి పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేశారు. ఎంపీ ఇంటి ముట్టడి విషయం తెలుసుకున్న పోలీసులు మూడు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి రక్షణ కల్పించారు. బారికేడ్లను తోసుకుంటూ మాజీ మంత్రితో పాటు నేతలు ఎంపీ ఇంటి వైపు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అక్కడికి చేరకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి..జోగురామన్నతో పాటు ప్రధాన నేతలను బలవంతంగా వాహనాల వరకు తీసుకెళ్లారు. ఈక్రమంలో పోలీసులు, నేతలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.ఇరువురి మధ్య తోపులాటలో కార్యకర్తలకు గాయాలయ్యాయి.చివరికి మాజీ మంత్రిని పోలీస్ వాహనంలో తరలించే ప్రయత్నం చేయగా..వాహనాన్ని నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిని దాటుకుని పోలీసులు రూరల్ స్టేషన్‌కు ఆయనను తరలించగా..సొంత పూచీ కత్తుపై విడుదల చేశారు.మాజీమున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో పాటు పలువురు నేతలు తిరిగి ఎంపీఇంటి ముందు ధర్నా చేసి నిరసన వ్యక్తంచేశారు.ఈసందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ..అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనుగోళ్లకు కేంద్రం కొత్త నిబంధనలను తెస్తూవారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు.పత్తికొనుగోళ్లు ప్రారం భమైన తొలిరోజు ఆరువందల పత్తివాహనాలు వస్తే అందులో అయిదింటికి మాత్రమే పన్నెండు శాతం తేమ వచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర ఆధీనంలో ఉన్న సీసీఐ నిబంధనలు సడలించా ల్సింది పోయి..స్థానిక ఎంపీ,ఎమ్మెల్యేలు వాటిని సమర్థించడం అన్యాయమని మండిపడ్డారు. సోయా కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించినప్పటికీ కొనుగోళ్లు మాత్రం జరగడం లేదన్నారు.అన్న దాతలకు అండగా బీఆర్ఎస్ నిలబడు తుందని, వారికి న్యాయంజరిగేంత వరకు పోరాటం తప్ప దని స్పష్టంచేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు విజ్జగిరినారాయణ,రమేష్, అజయ్,పవన్‌నాయక్,ధమ్మపాల్,ప్రశాంత్,జగదీష్ పాల్గొన్నారు.

ఒకరికి 14 రోజుల రిమాండ్



మాణిక్‌రావును కోర్టుకు హాజరు పరిచిన అటవీశాఖ అధికారులు

ఉట్నూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీర్సాయిపేట అటవీ రేంజ్ పరిధిలో లక్కకోసం అక్రమంగా చెట్లు నరికిన కుమ్మరి కుంటకు చెందిన మడావి మాణిక్‌రావుకు ఉట్నూర్ జూనియర్ సివిల్ న్యాయాధికారిమౌనిక 14 రోజుల రిమాండ్ విధించారని బీర్సాయిపేట ఫారెస్టురేంజ్ ఆఫీసర్ ఈర్ల అరుణ తెలిపారు.అటవీ ప్రాంతంలో అక్ర మంగా చెట్లు నరికన మాణిక్‌రావునుకోర్టుకు హాజరుపరిచామని తెలిపారు.ఎఫ్ఆర్ఓ వెంట డీఆర్ఓ సీతారాం,ఫారెస్టు బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

కాలుబాబా జెండా ఆవిష్కరణ



ఉమ్రిలో జెండా వద్ద పూజలు

ఉట్నూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్రిలో మధుర ప్రజల గురువు కాలు బాబా జెండా ఆవిష్కరణ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరు సామూహిక పూజలు నిర్వమించారు. మధుర ప్రజలు ఉన్న గ్రామాలలో కాలు బాబా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టాలని తీరుమణించారు. ఈ కార్యక్రమంలో భామన్ సర్దార్‌సింగ్, గులాబ్‌నాయక్, అర్జున్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాసర గోదారమ్మకు మహా హారతి



గోదావరిలో అమ్మవారికి తెప్పోత్సవం



కార్తీక పౌర్ణమి సందర్భంగా మహా హారతి పూజ నిర్వహిస్తున్న దేవస్థాన పండితులు

బాసర, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం బాసర గోదావరి నది తీరంలో భక్తజన సందోహంతో కిటకిటలాడింది. ముఖ్యంగా దేవస్థాన పండితులు నిర్వహించిన జ్వాలాతోరణం కార్యక్రమం అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో కొనసాగింది. సకల పాపాలు తొలగించే జ్వాలాతోరణం సాయంత్రం వేళ, వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా జ్వాలాతోరణాన్ని జ్వలింపజేశారు. ఈ జ్వలించే తోరణం కింద నుంచి వెళితే సకల పాపాలు తొలగి పోతాయని పండితులు తెలపడంతో భక్తులు భక్తి పారవశ్యంతో తోరణం వెంబడి దూరి పూజలు నిర్వహించారు.ఈ అపురూప దృశ్యాన్ని తిలకించడానికి, పూజల్లో పాల్గొనడానికి భక్తులు తరలివచ్చారు.

రుద్రాభిషేకం, మహాహారతి

జ్వాలాతోరణం కార్యక్రమానికి ముందు, పండితులు గోదావరినది తీరంలో ఉన్న శివలింగానికి రుద్రాభిషేక పూజలు నిర్వహించారు.అనంతరం గోదావరి నదికి మహాహారతి కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.

హాజరైన ప్రముఖులు

ఈ పవిత్ర కార్తీక పౌర్ణమి పూజా కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు జిల్లా ఎస్పీ జానకీ షర్మిల, ఆర్డీఐ కమిషన్ చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొని గోదారమ్మ అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. పవిత్రమైన కార్తీకపౌర్ణమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుక బాసర ఆధ్యాత్మిక శోభను పెంచింది.



. గోదావరమ్మకు హారతి ఇస్తున్న పండితులు

గోదారమ్మకు మహా హారతి

కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం బాసర గోదావరి తీరం ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడింది. సరస్వతి దేవస్థానం పండితులు వేద మంత్రోచ్చారణ మధ్య చక్రా, కలశ, కుంభ, నక్షత్ర శంకు వంటి ప్రత్యేక హారతులతో గంగమ్మకు మహాహారతి సమర్పించారు. అంతకంటే ముందు నిర్వహించి రుద్రాభిషేకం, జ్వాలాతోరణం కార్యక్రమాలు గోదావరి తీరం పులకరించిపోయింది. రెండు గంటల పాటు కొనసాగిన మంత్రోచ్చారణలతో ప్రాంతమంతా మంగళధ్వనులతో మార్మోగింది. భారీగా తరలివచ్చిన భక్తులతో పాటు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు, ఆర్డీఐ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, దంపతులు, జిల్లా ఎస్పీ జానకీ షర్మీల తదితర ప్రముఖులు ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా ముఠా పట్టివేత



పశువులను తరలిస్తున్న వాహనం

నేరడిగొండ,నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి):అంత రాష్ట్ర పశువుల అక్రమ రవాణా ముఠాను నేరడిగొండ పోలీసులు ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం మహా రాష్ట్ర లోని గడ్‌చందూర్‌నివాసి షేక్ ఇమ్రాన్‌బాబు,ఇచ్చోడమండల కేంద్రానికిచెందిన మొహమ్మద్ జాకీర్‌లు కలిసి అక్రమంగా పశువుల రవాణా ముఠాను నడిపించారు. వీరు ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామాల్లో పశువులను సేకరించి, మొహమ్మద్ ఇమ్రాన్‌కు చెందిన వాహనం ద్వారా అనంతపూర్ మీదుగా కొచ్చిన్‌లోని మహేంద్ర త్రిమూర్తి వద్దకు తరలించి పశువులను ఎద్దులను ఎక్కువ ధరకు విక్రయించేవారు. వారికి సఫాన్ హనీఫ్ సేథ్, అస్లాం, మరియు మెహబూబ్ అలీ ఖురేషి సహాయం చేసేవారు. ఇదే క్రమంలో మొహమ్మద్ జాకీర్ షేక్ ఇమ్రాన్ సోమవారం ఇచ్చోడ మార్కెట్ (ఎడ్లఅంగడి) నుంచి 16 ఎద్దులను కొనుగోలు చేసి, అదనంగా దొంగిలించిన మూడు ఎద్దులను మొహమ్మద్ ఇమ్రాన్ వాహనంలో వాటిని కొచ్చిన్‌కు తరలిస్తుండగా, ముందస్తు సమాచారం మేరకు వారిని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా వారు ఇప్పటి వరకు చేసిన దొంగతనం. ఈముఠాలో ఎంతమంది ఉన్నారు. వారందరిని అదుపులోకి తీసుకుని బుధవారం విచారించిన అనంతరం వారు నేరాన్ని ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి ఈ కేసులో పాలుపంచుకున్న 10 మందిలో 8 మందిని రిమాండ్‌కు తరలించామని, మిగిలిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

అఖిల్‌రెడ్డి లేని లోటు తీరనిది : ఆడే గజేందర్



అఖిల్‌రెడ్డి సంతాప సభలో ఆడే గజేందర్

నేరడిగొండ/ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్) నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అఖిల్‌రెడ్డి లేని లోటు తీరనిది, అందరితో కలిసి ఉండే వ్యక్తి చిన్న వయసులో మృతి చెందడం చాలా బాధాకరమని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు.అదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి బావమరిది కీర్తిశేషులు శ్రీగడ్డం అఖిల్‌రెడ్డిగత వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా బుధవారం వారి సంతాపసభ కంది శ్రీనివాస్‌రెడ్డి ప్రజా భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నరసయ్యతో కలిసి పాల్గొని,వారి ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థిస్తూనివాళి అర్పించారు.ఆయన వెంట నాయకులు, ఆడే వసంత్‌రావ్ రాజశేఖర్‌రెడ్డిమహేందర్ పోతారెడ్డి. నారాయణ్ సింగ్ సద్దాంలు ఉన్నారు.

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి బావమరిది గడ్డం అఖిల్‌రెడ్డి సంతాపసభ బుధవారం పట్టణంలోని ప్రజాసేవాభవన్‌లో అశ్రునయనాల మధ్యజరిగింది.పెద్దసంఖ్యలో హాజరైన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,బంధుమిత్రులు, సన్నిహితులు అఖిల్‌రెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తంచేశారు.ముందుగా అఖిల్‌తండ్రి గడ్డం రమేష్‌రెడ్డి, సోదరి మౌనా శ్రీనివాసరెడ్డి బావ కంది శ్రీనివాసరెడ్డి, మేనమామ డేరా కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గత నెల26నఆదివారం ఉదయం గుండెపోటుతో అకాల మరణం చెందిన గడ్డం అఖిల్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ బరువెక్కిన హృదయాలతో మాటలు పంచుకుంటూ సంతాపం తెలిపారు. అతని ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు.కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తుమల్లేష్, ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడెగజేందర్,జైనథ్ మార్కెట్‌కమిటీ చైర్మన్ అల్లూరిఅశోక్‌రెడ్డి, బోథ్ ఆత్మకమిటీ చైర్మన్ రాజుయాదవ్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

ముథోల్ నియోజకవర్గ వాసులకు,
రాజకీయ పార్టీల శ్రేణులకు, అధికారులకు,
రైతులకు, శ్రేయోభిలాషులకు
ఆంధ్రజ్యోతి దినపత్రికకు
23వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
చంద్రశేఖర్
అశోక్
ప్రవీణ్ కుమార్
రమేష్ - లక్ష్మి

వేడుక ఏదైనా..
సందర్భం ఎటువంటిదైనా
వివాహ వార్షికోత్సవం
స్వదేశీ, విదేశీయానం
లీగల్ ప్రకటనలు
పదవీ విరమణ
శ్రద్ధాంజలి
జన్మదినం
షష్టిపూర్తి
జయంతి
వర్ధంతి
క్లాసిఫైడ్స్
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా అతి తక్కువ రేట్లకే శుభాకాంక్షలు తెలియజేయండి
ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
ఆదిలాబాద్: 99854 11291
నిర్మల్ : 80966 77672
యాడ్స్ మేనేజర్ : 99854 11453

ఎమర్జెన్సీ.. కనిపించదేమీ?

- నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలతో భయపడుతున్న ప్రయాణికులు

7 లో


● ఫోన్ బాక్సులో ఫోన్ లేదని చూపిస్తున్న ప్రయాణికుడు మల్లేష్

ఆరనీకుమా.. కార్తీకదీపం



- జిల్లాలో దేదీప్యంగా కార్తీక పౌర్ణమి వేడుకలు
- దీపారాధనతో వెలిగి పోయిన ఆలయ ప్రాంగణాలు
- వేకువజాము నుంచే ప్రసిద్ధ ఆలయాలకు భక్తుల బారులు
- భక్తి ప్రపత్తులతో తులసీ వివాహాలు

కార్తీక పౌర్ణమి వేడుకలను.. బుధవారం జిల్లాలో అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ప్రసిద్ధ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. పలుచోట్ల శైవ ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి భక్తి ప్రపత్తులను చాటారు.


● సిరిచెల్మ మల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వివరాలు 6లో....



తేమ శాతం తగ్గగానే పంటల కొనుగోలు

బోథ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు పంట కొనుగోళ్లపై ఆందోళన చెందవద్దని తేమ వాతం తగ్గిన వెంటనే అన్ని రకాల పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న సోయాబీన్ పంటల తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మొక్కజొన్న పంట కొనుగోలు ప్రారంభమయ్యాయన్నారు. అయితే మొక్కజొన్న కొనుగోళ్ల అనంతరం సోయాబీన్ కొనుగోలు చేస్తామన్నారు. సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, సీఈవో గోలిస్వామి, భూషణ్ ఉన్నారు.


దత్తు పశువుల పాకలో బయటపడ్డ పాము

పశువుల పాకలలో పాముల కలకలం

బోథ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని పశువుల పాకలలో పాములు సంచరిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజుల క్రితం తూము సుదర్శన్ అనే రైతు పశువుల పాకలో ఆరడుగుల నాగుపాము కలకలం సృష్టించగా.. తాజాగా బుధవారం మెరుగు దత్తు అనే రైతు పశువుల పాకలో రక్తపింజర పాము కనిపించడంతో రైతు ఆందోళన గురయ్యాడు. ప్రమాదకరమైన పామును చూసిన వారు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే కొంతమంది పామును చంపి వేయడం జరిగింది. వర్షాకాలం వాగుల ఉధృతిలో కొట్టుకు వచ్చిన పాములు పశువుల పాకలోకి దూరాయని రైతులు అంటున్నారు.

పత్తి రైతుకు.. మద్దతు కరువు

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) .. కఠినమైన నిబంధనలతో పత్తి రైతులకు మద్దతు దక్కడం లేదు. ఈ యేడు క్వింటాలు పత్తి మద్దతు ధర రూ.8,110గా ప్రభుత్వం నిర్ణయించింది. అధిక వర్షాలతో అంతంత మాత్రంగా వస్తున్న దిగుబడులను అమ్ముకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కపాస్ కిసాన్ యాప్‌తో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. అనుకూలించని వాతావరణ పరిస్థితులు, గందరగోళంగా మారిన కొనుగోళ్లతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.


● ఇంటి వద్ద ఆరబోసిన పత్తిని చూపుతున్న రైతులు

జిల్లాలో 52 మంది రైతులకే 'మద్దతు'

- సీసీఐ తేమ, కొనుగోళ్ల పరిమితితో ప్రైవేట్‌కే మొగ్గు
- నేటి నుంచి ప్రైవేట్, సీసీఐ కొనుగోళ్లు వాయిదా
- ఉద్రిక్తంగా మారిన ఎంపీ గోడం నగేష్ ఇంటి ముట్టడి
- పత్తి కొనుగోలు కార్యక్రమాలు యథావిధిగా సాగుతాయి : కలెక్టర్

ఆదిలాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్టోబరు 24 నుంచి సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఈ యేడు 1,36,752 మంది రైతులు 4,25,932.15 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. ఎకరాన 8 క్వింటాళ్ల పత్తి దిగుబడులు వస్తాయని అంచనా వేశారు. ఈ లెక్కన మొత్తం 33లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. వర్షాధారంగా సాగుచేసిన భూముల్లో ఎకరాన 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అలాగే పత్తి నలుపు బారీ నాణ్యత దెబ్బతినడంతో మద్దతు ధర దక్కడం లేదంటూ ఆవేదన వ్యక్తమవుతుంది. సీసీఐ కఠిన నిబంధనలు విధించడంతో అన్నదాతలు ఆందోళన కు గురవుతున్నారు. వెంటనే నిబంధనలు ఎత్తివేసి రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయాలని రైతు సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. మొత్తానికి జిల్లాలో పత్తి కొనుగోళ్లు గందరగోళంగా మారడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.



నష్టపోతున్నాం.. పట్టించుకోండి

: కాటిపెల్లి వెంకట్ రెడ్డి, రైతు, తలమడుగు

ఈ యేడు కురిసిన అధిక వర్షాలతో దిగుబడులు లేక తీవ్రంగా నష్టపోయాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం పట్టించుకుని రైతులను ఆదుకోవాలి. పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదు. తేమ పరిమితి నిబంధనలను పూర్తిగా ఎత్తివేయాలి. రైతుల పై సీసీఐ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తుంది.ఎలాంటి షరతులు లేకుండా పత్తి పంటను కొనుగోలు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. తేమతో చాలా మంది రైతులకు మద్దతు ధర దక్కడం లేదు.

మద్దతు ఏది?

సీసీఐ నిబంధనలతో మద్దతు ధర కొందరికే దక్కుతుంది. తేమ 8నుంచి 12 శాతం ఉంటేనే కొనుగోలు చేస్తున్నారు. ఆపైగా తేమ ఉంటే నిరాకరిస్తున్నారు. దీంతో రైతులు ప్రైవేట్‌కే పత్తిని అమ్మేందుకు మొగ్గు చూపుతున్నా రు. జిల్లాలో అధిక మంచు కురవడంతో

(తరువాయి 6వ పేజీలో....)

ఉద్రిక్తంగా మారిన ఎంపీ ఇంటి ముట్టడి

- తేమ నిబంధన, కొనుగోళ్ల పరిమితిపై బీఆర్ఎస్ తీవ్ర ఆందోళన

-7లో


జోగు రామన్నను తీసుకెళ్తున్న పోలీసులు

ఘనంగా సత్యదేవుడి వ్రతాలు

- పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు
- జైనథ్‌లో కొనసాగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు

ఆదిలాబాద్(జైనథ్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. స్వామివారి ఆలయం ముందు నిర్వహించిన ఈ సామూహిక సత్యనారాయణ వ్రతాలతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాతో పాటు కరీంనగర్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి 451 జంటలు హాజరై సామూహిక వ్రతాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రూకేష్ రెడ్డి, ఈవో చంద్రశేఖర్, ప్రధాన అర్చకులు దీరజ్, ప్రణీత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.




పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న దంపతులు (ఇన్‌సెట్ సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనం

అంతర్ రాష్ట్ర పశువుల అక్రమ రవాణా ముఠా పట్టివేత

- జిల్లాలోని ఆయా గ్రామాల్లో పశువుల సేకరణ
- మహారాష్ట్రలోని గడ్ చందూర్‌వాసితో కలిసి ఇచోడకు చెందిన మహ్మద్ జాకీర్ దందా

7 లో

మెరుగైన వైద్యం అందేలా పూర్తి చర్యలు

- కలెక్టర్ రాజర్షి షా ఆదేశం
- క్యాంపు కార్యాలయంలో ఆరోగ్య శాఖ, వైద్యాధికారులతో సమావేశం

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులు ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆరోగ్య శాఖ, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణాలతో పాటు గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉట్నూర్, బోథ్, బేల, గాదిగూడ వంటి దూర ప్రాంతాల మహిళలు, ముఖ్యంగా గర్భిణులు మెరుగైన వైద్యసేవల కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించే సౌకర్యం కల్పించాలని సూచించారు. జిల్లాలో ఐరన్ లోప అనీమియాతో బాధపడుతున్న మహిళలకు ప్రత్యేక వైద్యపరీక్షలు, చికిత్సలు అందించాలని సూచిస్తూ, ఈ కార్యక్రమంపై ఆశా, ఏఎన్ఎమ్, అంగన్‌వాడీ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లాలో నమోదైన నవజాత శిశు మరణాలపై సమగ్ర విశ్లేషణ జరపాలని ఆయన సూచించారు. తల్లుల పోషకాహారం లోపం, గర్భధారణ సమయంలో అవసరమైన వైద్యపరీక్షలు చేయించుకోకపోవడం, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు సమయానికి చికిత్స అందకపోవడం వంటి కారణాల వల్ల తక్కువ బరువుతో పుట్టిన శిశువుల సంఖ్య పెరుగుతోందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించిన కలెక్టర్, ప్రతి పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ స్థాయిలో తల్లుల ఆరోగ్య స్థితి, హిమోగ్లోబిన్ స్థాయిలు, ఆహారపు అలవాట్లు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ వాడకం, పోషకాహార పంపిణీ వంటి అంశాలను సమీక్షించి హై రిస్క్ కేసుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు అనంత్ రావు, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

రైల్వే బ్రిడ్జిల పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): ఆదిలాబాద్ పట్టణంలో కొనసాగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి, ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి రైల్వే, రహదారులు, భవనాలు, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని రైల్వే కోర్డినేటింగ్ క్రాసింగ్‌ల వద్ద తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ ప్రాజెక్టులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో సుమారు రూ.94 కోట్ల వ్యయంతో ఈ రెండు ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ, సాంకేతిక అనుమతులు తుది దశలో ఉన్నాయని వెల్లడించారు. డిసెంబర్‌లో పనులు ప్రారంభించి 2026 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో రైల్వే సీనియర్ ఇంజనీర్ సాంబ శివరావ్, ఆర్‌అండ్‌బి అధికారులు నర్సయ్య, రాజేశ్వర్, తదితరురులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బస్సు

- ఘటన స్థలంలోనే ఒకరి మృతి
- ఒకరి పరిస్థితి విషమం
- శంకర్‌గూడ సమీపంలో ఘటన

ఇంద్రవెల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సుఢీ కొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనంలోని ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని శంకర్‌గూడ సమీపంలో ప్రధాన రహదారిపై జరిగింది. స్థానికులు, ప్రత్యేక సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హర్కపూర్, అంద్‌గూడ గ్రామానికి చెందిన ధన్వే సంజు, బోల్కే సంతోష్ (23)లు ద్విచక్ర వాహనంతో ఆదిలాబాద్‌కు వెళ్లి తిరిగి ఇంద్రవెల్లికి వస్తుండగా శంకర్‌గూడ సమీపంలో మెండపల్లి చౌక్ వద్ద ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల వద్ద ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళుతున్న ఉట్నూర్ డిపోకు చెందిన (టీఎస్ 01యూఏ.4499) గల ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చున్న బోల్కే సంతోష్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న ధన్వే సంజుకు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్ సాయంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. సంజుది ఒక కాలు, రెండు చేతులు విరగడంతో పాటు తలకు, ఛాతిపై బలమైన గాయాలున్నాయని, పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌కు సందర్శించి గాయాలతో చికిత్స పొందుతున్న సంజు పరిస్థితిని పరిశీలించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం తరలించినట్లు తెలిపారు. నిర్లక్ష్యంగా బస్సు నడిపిన బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారణ చేసినట్లు తెలిపారు. బోల్కే మారుతి, లక్ష్మీబాయి దంపతులకు మృతుడు సంతోష్ ఏకైక కుమారుడు కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. హర్కపూర్, అంద్‌గూడలో విషాదఛాయలు అలుముకున్నాయి.


బైక్‌ను ఢీకొట్టిన బస్సు (ఇన్‌సెట్‌లో మృతుడు(ఫైల్)

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి: మంత్రి పొన్నం


మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశంలో పాల్గొన్న జిల్లా ఆర్‌టీఏ సభ్యులు దూట రాజేశ్వర్

ఉట్నూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేయాల్సి ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్‌తో పాటు వివిధ జిల్లాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఇటీవల ప్రమాదాలు జరుగుతున్నందున రవాణా శాఖ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా యూనిసెఫ్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శైలజలు ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు.

మునిసిపాలిటీలో శిక్షణ అధికారుల పర్యటన

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శిక్షణ సివిల్ సర్వీసెస్ అధికారులు బుధవారం ఆదిలాబాద్ మున్సిపాలిటీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ పాలన, ప్రజా సేవల అందజేత, పట్టణాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానాలను తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు అధికారులకు స్వాగతం పలికి.. మున్సిపాలిటీ విభాగాల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు తదితర అంశాలను వివరించారు. అనంతరం బంగారిగూడలో పర్యటించిన అధికారులు.. పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యన్ని పరిశీలించారు. బంగారిగూడ డంపింగ్ యార్డు, ఘన వ్యర్థాల నిర్వహణ విధానం, పర్యావరణ పరిరక్షణ చర్యలను ఈ సందర్భంగా వారు పరిశీలించారు. బ్రాహ్మణవాడ పాఠశాలలోని స్వయం సహాయక, స్లమ్ కోర్డినేటింగ్ గ్రూప్స్‌లో మహిళల జీవనోపాధి కార్యకలాపాలపై చర్చించారు. మున్సిపల్ ఫిల్టర్ బెడ్‌లో నీటి శుద్ధి, సరఫరా ప్రక్రియలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ ద్వారా చేపడుతున్న పరిశుభ్రత చర్యలు, మహిళా సాధికారత, ప్రజాభాగస్వామ్య కార్యక్రమాలను ప్రశంసించారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద శిక్షణ సివిల్ సర్వీసెస్ అధికారులు